క్లుప్తంగా

బుగ్గ ఆలయంలో అన్నదానం ప్రారంభం


అన్నదానం చేస్తున్న డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ ప్రారంభించారు. టీటీడీ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి సోమవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం జరగనుంది. తిరుపతికి చెందిన చలపతి అనే దాత సోమవారం ఆలయంలో అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ ఆలయంలో వడమాల పూజలు



నగరి : స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కాలభైరవ స్వామి సన్నిధిలో సోమవారం వడమాల పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ పూజలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

చికెన్ హబ్ ప్రారంభం


చికెన్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లి మిట్టలో ఏఎంసీ డైరెక్టర్ గోవిందరెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎఫ్‌సీ చికెన్ హబ్‌ను ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సోమవారం ప్రారంభించారు. చిత్తూరు డిప్యూటీ మేయర్ రాజేష్, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, స్థానిక సర్పంచ్ డిల్లయ్య పాల్గొన్నారు.

దేవులపల్లి అమర్ రాక


విమానాశ్రయంలో దేవులపల్లి అమర్‌కు స్వాగతం పలుకుతున్న బాలకొండయ్య

రేణిగుంట: జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌కు సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనకు ఎయిర్‌పోర్ట్‌లో జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబసమేతంగా తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు.

ముక్కంటి సేవలో..


గోపూజలో సూర్య ప్రకాశనంద మహారాజ్‌స్వామి

శ్రీకాళహస్తి: అసోం రాష్ట్రం గౌహతి కామాఖ్యే ఆలయ అర్చకులు సూర్యప్రకాశనంద మహారాజ్ స్వామి సోమవారం గోపూజలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తాను పుట్టింది ఒంగోలు జిల్లా అద్దంకి అని ఆయన తెలిపారు. ఒట్టి పోయిన ఆవుల సంరక్షణకు గోశాలలు ఏర్పాటు చేయాలనే సంకల్పంలో భాగంగా శ్రీకాళహస్తికి విచ్చేశానన్నారు. రోడ్లపై తిరుగుతున్న గోవులు, బక్కచిక్కి శల్యమైపోయిన గోవులను సంరక్షించాలన్నదే తన ఉద్దేశమని, ఇదే విషయాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లామన్నారు. పూర్తి వివరాలతో వినతి పత్రం ఇస్తే పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు.

అర్థం చేసుకుని చదవాలి

నగరి : ఉపాధ్యాయులు బోధించే పాఠాలను బాగా అర్థం చేసుకుని చదవాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. సోమవారం పాఠశాలల ప్రారంభాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని కాకవేడు ఏపడబ్ల్యూలోని పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు.

మోగిన బడి గంటలు

- పండుగ వాతావారణంలో పాఠశాలల పునఃప్రారంభం
- సరికొత్తగా రూపుదిద్దుకున్న ప్రభుత్వ స్కూళ్లు
- తొలిరోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేత


విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : మండలంలోని ఎం.కొత్తూరు గ్రామంలోను మున్సిపల్ పరిధిలోని కొత్తపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్ రెడ్డి విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు ఇంతగా ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం ఎక్కడా లేదన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే రూ.2400 విలువైన బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, కుట్టు కూలితో సహా మూడు జతల యూనిఫాం క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతోపాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (6–10 తరగతి), పిక్టోరియల్ డిక్షనరీ (1–5 తరగతి) విద్యార్థులకు అందిస్తున్నారంటే ముఖ్యమంత్రి విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థమవుతోందన్నారు. విద్యార్థులకు అందించే విద్యాకానుక కిట్‌కు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నాలుగు దశల్లో నాణ్యతా పరీక్షలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్కూళ్లు తెరిచి 6, 7 నెలలైనా యూనిఫాం సంగతి దేవుడెరుగు కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించలేని దుస్థితి ఉండేదన్నారు. విద్యార్థుల చదువులను గాలికొదిలేస్తూ గత సర్కారు పెండింగ్‌లో పెట్టిన రూ.1,778 కోట్ల ఫీజు రీయింబర్స్ బకాయిలను సైతం సీఎం జగనన్న ప్రభుత్వమే చెల్లించిందన్నారు. అనంతరం ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లే ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడేలా, విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రానున్న రోజుల్లో ప్రతి స్కూల్‌లో ఇంగ్లిష్ మీడియంతో సీబీఎస్‌ఈ సిలబస్‌లో బోధించేలా సిద్ధమైందన్నారు. 'మనబడి నాడు–నేడు' తొలిదశ స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతి వరకు 30 వేల తరగతి గదుల్లో బైజూస్ కంటెంట్‌తో కూడిన ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ ద్వారా సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ బోధన చేపట్టనున్నారన్నారు. ఇంగ్లిష్ ల్యాబ్స్ తోపాటు 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి స్కూల్‌లో రూ.10 వేల స్మార్ట్ టీవీల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. మున్సిపల్, మండలంలోని అన్ని పాఠశాలల్లో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజిరెడ్డి, హెచ్‌ఎం కొండూరు రాజు, వైస్ ఎంపీపీ కన్నెప్ప, డిల్లీబాబు, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, సర్పంచులు నరసింహ, రవి, కనీ్వనర్ హరి, మధు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండల కేంద్రంలోని నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ దీప విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్రబాబు, ఎంపీడీఓ వేణు, ఎంఈఓ నారాయణ, సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ, కోఆప్షన్ సభ్యులు అనిల్, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ వసంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్‌లాల్, మేరి, హెచ్‌ఎం శివయ్య పాల్గొన్నారు.


ఏకాంబరకుప్పంలో విద్యాకానుక అందిస్తున్న కౌన్సిలర్లు


నింద్రలో విద్యాకానుక పంపిణీ చేస్తున్న ఎంపీపీ లత


శ్రీహరిపురంలో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ ఆంజనేయులు

విజయపురంలో..

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఆంజనేయులు జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాకానుక కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి


గర్భిణులకు సూచనలిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం ముద్దుకుప్పం సచివాలయం పరిధిలోని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా డాక్టర్ వైద్యం కోసం వచ్చిన, రోగులు, గర్భిణులతో మాట్లాడారు. ముఖ్యంగా గర్భిణులు పాలు, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం తదితర పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, రోగాల బారిన పడిన వారు త్వరగా కోలుకుంటారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్రౌపదీ కల్యాణం


ద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : మండల పరిధిలోని నెల్లేపల్లెలో గత ఐదు రోజులుగా జరుగుతున్న మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు వేదమంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు పంచ పాండవులు, శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. మొక్కుబడి ఉన్న భక్తులు అమ్మవారికి వడిబాల సమర్పించుకున్నారు. అలాగే ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికకు అమ్మవారిని తీసుకొచ్చి ధర్మరాజుల స్వామి వారితో కల్యాణోత్సవం నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రాల నడుమ ముత్యాల తలంబ్రాలు పోసి, కనులవిందుగా కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారిని స్థానిక ఇన్‌చార్జ్ సర్పంచ్ రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతీయ రహదారి నిర్మాణ పనుల అడ్డగింత


రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న గొప్పయ్యగుంట గ్రామస్తులు

శ్రీరంగరాజపురం: బెంగళూరు నుంచి తర్చూరు వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను గొప్పయ్యగుంట గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికులు మాట్లాడుతూ గొప్పయ్యగుంట, అన్నగారువూరు, ఎన్ఆర్ పురం కాలనీకి చెందిన తాము జాతీయ రహదారి నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చామన్నారు. ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి లేకుండా, రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు లేకుండా, ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి ఉన్నదారిని పూర్తిగా మూసివేశారన్నారు. గతంలో తాము పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఇదే విషయంపై ఫిర్యాదు చేశామన్నారు. అప్పుడు కలెక్టర్ సానుకూలంగా స్పందించి గ్రామాలకు రాకపోకలు సాగించడానికి వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటికీ వంతెన నిర్మించలేదని, కానీ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం చేపడుతున్నారని అందువల్లే తాము పనులను అడ్డుకున్నామని చెప్పారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని, రోడ్డుకు అడ్డంగా కూర్చుని వంతెనను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


కార్వేటినగరం: కిట్లను అందిస్తున్న ఎంపీపీ లత


శ్రీరంగరాజపురంలో..

- అన్ని ప్రభుత్వ స్కూళ్లలో విద్యాకానుక అందజేత

కార్వేటినగరం: విద్యతోనే విలువలతో కూడిన భవిష్యత్ సాధ్యమని ఎంపీపీ లత అన్నారు. సోమవారం స్థానిక ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను హెచ్‌ఎం ఇందిరా ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లే ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడేలా సీఎం జగనన్న ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకొచ్చారని, అదే విధంగా సీబీఎస్, ఈసిలబస్‌లో బోధన అందించేలా చర్యలు తీసుకుని విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఘనత రాష్ట్రప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి సంక్షేమ పథకాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పడతాయన్నారు. అనంతరం ఎంఈఓ ఎం.విజయ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత విలువలతో కూడిన విద్యను అందించడానికి నాడు–నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలను మార్చేసిందన్నారు. అదేవిధంగా బైజ్యూస్ కంటెంట్‌తో కూడిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ బోధన చేపట్టనున్నారని తెలిపారు. లక్షల రూపాయలు వెచ్చించి బ్లాక్‌బోర్డులు ఏర్పాటు చేసి తరగతి గదుల్లోనే విద్యార్థులు యావత్ ప్రపంచాన్ని చూసే విధంగా అధునాతన మార్పులు తీసుకొచ్చిన ఘనత కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని అత్యంత ఉన్నతమైన విద్యామెట్లను అధిగమిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జగనన్న కిట్లను అందించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కోఆప్షన్ మెంబర్ ఫట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీటీసీ ధన్‌రాజ్, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏఈ నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు జగనన్నతోనే సాధ్యం అవుతుందని 49 కొత్తపల్లిమిట్ట సర్పంచ్ డిల్లయ్య అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యాకానుక కిట్లను సర్పంచ్ డిల్లయ్య, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య అందజేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందుతోందని, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి అని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన విద్య అందించడం జరుగుతుందన్నారు.

దేశానికే ఆదర్శం.. సంక్షేమ పథకాలు

- పేదల ఇంట ఆనందం నింపడమే ప్రభుత్వ ధ్యేయం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం, ప్రజాప్రతినిధులు


బాలకృష్ణాపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. మండలంలోని బాలకృష్ణాపురం గ్రామ సచివాలయ పరిధిలోని అలిమేలుమంగాపురం, బాలకృష్ణాపురం ఆదిఆంధ్రవాడ, దళితవాడ, రామకృష్ణాపురం గ్రామాల్లో సర్పంచ్ శీభత్యాగ రాజ్, ఎంపీటీసీ లిఖిత ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలిమేలు మంగాపురంలో డ్రైనేజీ, బాలకృష్ణాపురం ఆదిఆంధ్రవాడ శ్మశానానికి రోడ్డు, బాలకృష్ణాపురం దళితవాడకు తాగునీటి బోరు, సీసీ రోడ్డు వేయాలని, కొత్త ఇళ్లు కావాలని పలువురు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. బాలకృష్ణాపురం ఆదిఆంధ్రవాడలోని పాఠశాలలకు మూడు కిలోమీటర్లు వెళ్తూ పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తమ గ్రామంలోని పాఠశాలను పునఃప్రారంభించేలా చూడాలని విన్నవించారు. దీనిపై ఆయన వెంటనే డీఈఓకి ఫోన్ చేసి గ్రామానికి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పవిత్ర గ్రంథంలా మేనిఫెస్టో..

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 98 శాతం హామీలను పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదప్రజల అభ్యున్నతి ధ్యేయంగా జనరంజక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఏపీఎం ఫరీద్‌మస్తాన్, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, నాయకులు పుత్తూరు కేశవరెడ్డి, ఇందిరమ్మ, సుందరాజు, అరుల్, ఆనందన్, సుబ్రమణ్యారెడ్డి, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మళ్లీ అబద్ధపు హామీలతో వస్తున్న చంద్రబాబు..

అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు మళ్లీ ఇప్పుడు అబద్ధపు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నాడని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు చంద్రబాబును నమ్మవద్దని డిప్యూటీ సీఎం కే నారాయణ స్వామి సూచించారు. సోమవారం ఆయన బాలకృష్ణాపురం గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అలిమేలు మంగాపురం, రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించాలన్నా లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం స్కూళ్లనే అభివృద్ధి చేశారన్నారు. కానీ చంద్రబాబు మాత్రం తన పాలనలో కార్పొరేట్లకు కొమ్ము కాశాడని ఆరోపించారు. పేద విద్యార్థుల చదువుల గురించి ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకుంటే, చంద్రబాబు ఆయన దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ మాత్రం కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు.

చలపతి కుటుంబానికి పరామర్శ


చలపతి రావును పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండలంలోని ఆర్కేవీబీ పేట గ్రామానికి చెందిన చలపతిరావు, ఆయన కుమారుడు చార్విక్ ఇటీవల తమిళనాడులోని తిరువణ్ణామలై గిరి ప్రదక్షణకు వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన తిరుపతిలోని ఎలైట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వారితో మాట్లాడుతూ అధైర్య పడవద్దని, అన్నివిధాలా ఆదుకుంటానని చలపతిరావు కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి భరోసా కల్పించారు.

కాపు సంక్షేమ సేన మండల అధ్యక్షుడిగా రవి



కార్వేటినగరం: కాపు సంక్షేమ సేన మండల అధ్యక్షుడిగా ఎం.రవిని నియమించినట్లు కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపిరాయల్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు మాజీమంత్రి హరిరామ జోగయ్య ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడిగా రవిని నియమించినట్లు చెప్పారు. అనంతరం రవి మాట్లాడుతూ కాపు సంక్షేమ సేన సిద్ధాంతాలకు కట్టుబడి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలోని కాపు నాయకులు సహకరించాలని కోరారు.

మా ఊరి కోసం నా పోరాటం

- మా గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను ఆపండి
- దాసరాపల్లెకు చెందిన ఓ యువకుడి నిరసన



నిరసన చేపడుతున్న మణి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): తమ గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమిచుకుని అక్రమ కట్టడాలు చేపడుతున్నారంటూ సోమవారం ఓ యువకుడు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసనకు దిగాడు. మండలంలోని దాసరాపల్లె గ్రామానికి చెందిన యువకుడు మణి మాట్లాడుతూ తమ గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని అదే ఊరికి చెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని ఆరోపించాడు. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు వినతి చేసినా పట్టించుకోలేదని తెలిపాడు. రెండు రోజులుగా ఆ స్థలంలో కృష్ణారెడ్డి అక్రమ కట్టడాలకు పాల్పడుతున్నాడని సోమవారం చార్వాకానిపల్లె సచివాలయంలో మరోమారు ఫిర్యాదు చేశానని మణి తెలిపాడు. దీనిపై అక్కడి సిబ్బంది కూడా స్పందించకపోవడంతో పెనుమూరులోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసనకు పూనుకున్నట్లు చెప్పాడు. స్పందించిన రెవెన్యూ అధికారులు వెంటనే గ్రామానికి వెళ్లి అక్రమ కట్టడాలను నిలిపి వేశారు. మరో వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చి యువకుడితో నిరసనను విరమింపజేశారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు


తిరుపతి డిపోలో ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో అంకితభావంతో పనిచేస్తున్న పలువురు డ్రైవర్లు, కండెక్టర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సోమవారం తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కండెక్టర్లు వీకే.కుమార్, ఎస్.మునెమ్మ, శ్రీవిద్య, లక్ష్మీకుమారి, మల్లిఖార్జున్, లత, డ్రైవర్లు రత్నం, రమేష్, వీకే.రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివశంకరయ్య, కలందర సాహెబ్, నాగరాజు, వెంకటకుమార్, అమానుల్లా, గ్యారేజ్ సిబ్బంది అంకయ్య, గురవయ్య ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అలాగే మంగళం డిపోలో పనిచేస్తున్న కండెక్టర్లు జయంతి, నీలకంఠయ్య, కేఎస్.లత, బి.హరి, డ్రైవర్లు ఎస్‌సీ.మౌళి, కె.చంద్రయ్య, జీవీ.రత్నం, వీఏ.రెడ్డి, ఎంఆర్.కుమార్, ఎస్ఎస్.వర్మ, ఎంబీ.నాయుడుకు డిపో మేనేజర్ కేసీజీ.భాస్కర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

అవగాహన ర్యాలీ


నాగలాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ శోభారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు

పిచ్చాటూరు: జీవ భాగీదారిపై పిచ్చాటూరు, నాగలాపురం సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిచ్చాటూరు మండలం గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. జీవ భాగీదారి గురించి తెలియజేశారు. దీనిని పిల్లల తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.